
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 27 జూలై 2024

కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కేటీఆర్



తలసరి ఆదాయంలో జయశంకర్ జిల్లాకు

ఐదో స్థానం



- 'ఉపాధి' పనిదినాల కల్పనలో ఆరో స్థానంలో జనగామ
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

హనుమకొండ, జులై 26 (ఆంధ్రజ్యోతి): తలసరి ఆదాయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలవగా హనుమకొండ జిల్లా చివర స్థానంలో ఉంది. గురువారం అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో బడ్జెట్‌తో పాటు ప్రవేశపెట్టిన ఆర్థిక, సామాజిక సర్వే వెల్లడించింది. ఆ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా తల సరి ఆదాయం రూ.2,71,555 కాగా.. వరంగల్ రూ.2,22,640తో 15వ స్థానంలో నిలిచింది. జనగామ జిల్లా రూ.2.17,277తో 18వ స్థానం, మహబూబాబాద్ జిల్లా రూ.1,99,588తో 23వ స్థానం, ములుగు జిల్లా రూ.1,97,539తో 25వ స్థానం, హనుమకొండ జిల్లా రూ.186,784తో 26వ స్థానంలో నిలిచింది.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలవగా, మహబూబాబాద్ జిల్లా 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 24.80లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా, దానిని మించి 30.5లక్షల పనిదినాలను (123 శాతం) పనిదినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి 20.3లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా 19.3లక్షల పని దినాలను కల్పించాలన్నది లక్ష్యంగా, 21.9 లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానంలో, ములుగు జిల్లాలో 12.1 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యంగా 13.4 లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా, 21.2 లక్షల పనిదినాలతో (106 శాతం) 29 స్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, 55.9 (105శాతం) పనిదినాలతో రాష్ట్రస్థాయిలో అట్టడుగున 31 స్థానంలో నిలిచింది.

జిల్లాల వారీగా భూ కమతాలిలా..

రైతులు వ్యవసాయ భూములను కలిగి ఉండడంలో రాష్ట్రస్థాయిలో జనగామ జిల్లా ఐదోస్థానంలో నిలిచింది. అతి తక్కువ భూములు కలిగి ఉన్న జిల్లా వరంగల్ అని ఆర్థిక సామాజిక సర్వే రిపోర్టులో పేర్కొన్నారు. జనగామ జిల్లాలో సరాసరి ల్యాండ్ హోల్డింగ్స్ 0.95 హెక్టార్లు కాగా, ములుగు జిల్లాలో 0.92హెక్టార్లు, మహబూబాబాద్ జిల్లాలో 0.87 హెక్టార్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 0.85 హెక్టార్లు, హనుమకొండ జిల్లాలో 0.75 హెక్టార్లు, వరంగల్ జిల్లాలో 0,74 హెక్టార్లు కలిగి ఉన్నారు. ల్యాండ్ హోల్డింగ్ అనేది ప్రధానంగా భూమిని కలిగి ఉన్న లేదా సొంతం చేసుకునే స్థితి లేదా వాస్తవంతో వ్యవహరించే భావన. దేశ ఆర్థిక, రాజకీయ ప్రక్రియలపరంగా భూమి కలిగి ఉండడం (హోల్డింగ్) ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

అడవులు, వన్యప్రాణులు

కాళేశ్వరం సర్కిల్ పరిధిలో మొత్తం అడవి 22,65,548.9 ఎకరాలున్నట్టు ఆర్థిక సామాజిక సర్వేలో పేర్కొన్నారు. ఇందులో రిజర్వు ఫారెస్టు 21,17,394.3 ఎకరాలు రక్షిత అడవి 1,19,999 ఎకరాలు కాగా, అన్ క్లాసిఫైడ్ ఏరియా 28,155.6 ఎకరాలు ఉంది. ఏటూరునాగారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 803 చదరపు కిలోమీటర్లు, మహబూబాబాద్, వరంగల్‌తో కూడిన పాకాల వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 860.2 చదరపు కిలోమీటర్లున్నట్టు తెలిపింది.

మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్-6 వద్ద కేటీఆర్ బృందం



- ముక్తీశ్వరాలయం, త్రివేణి సంగమాల వద్ద ప్రత్యేక పూజలు
- కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీల పరిశీలన
- కాళేశ్వరం నీటిని వెంటనే ఎత్తిపోయాలి
- విలేకరుల సమావేశంలో కేటీఆర్
- చిల్లర ప్రచారాలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు

మూడున్నర గంటలు..

కాళేశ్వరంలో సాగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పర్యటన

మహదేవపూర్ రూరల్ / మహదేవ్‌పూర్, జూలై 26 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతల బృందం శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో పర్యటించింది. సుమారు మూడున్నరగంటల పాటు ఆ బృందం పర్యటన సాగగా.. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్, మేడిగడ్డ బ్యారేజీలను నేతలు సందర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నేతృత్వంలో ఉదయం 10గంటలకు కాళేశ్వరం చేరుకున్న ప్రజాప్రతనిధులు, నేతలు తొలుత శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయానికి చేరుకోగా వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో రుద్రాభిషేకం, ప్రత్యే క పూజలు చేశారు. ఆ తర్వాత 10.30 గంటలకు శుభనందాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేటీ ఆర్, ఎమ్మెల్యేల బృందాన్ని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదా లు అందజేశారు. అక్కడి నుంచి 10.45 గంటలకు గోదావరి నది వద్దకు చేరుకున్న కేటీఆర్, నేతలు ప్రత్యేక పూజలు చేసి కన్నెపల్లి పంప్‌హౌజ్‌కు బయలుదేరి వెళ్లి.. 11.05కు అక్కడికి చేరుకుని పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. 11.10 గంటకు మీడియా సమావేశంలో మాట్లాడి మేడిగడ్డకు తరలారు. మధ్యాహ్నం 12.45గంటలకు మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్ 6 వద్ద గోదావరినది ప్రత్యేక పూజలు చేసి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. 1.35 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ వంతెనపై నుంచి బయటకు వచ్చి చెన్నూరుకు బయలుదేరి వెళ్లిపోయారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు



కాళేశ్వరంలో గోదావరికి పూజలు చేస్తున్న కేటీఆర్

రాజకీయాలకు పోయి రైతులను ఆగం చేయొద్దు : కేటీఆర్

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపహౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి, ఎగువ గోదావరిలోని రిజర్వాయర్లను నింపాలని, రాజకీయాలకు పోయి రైతులను ఆగం చేయొద్దని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నెపల్లి లక్ష్మీపంపుహౌస్ సందర్శించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి వరప్రదాయిని అని, కేసీఆర్ ప్రారంభించిన ఈప్రాజెక్టు ద్వారా రైతులకు మేలు జరిగితే తమకు మనుగడ ఉండదనే దురుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. అన్నాదతల ఆకలి తీర్చే కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 'మేడిగడ్డ కుంగిపోయింది.. కాళేశ్వరం కొట్టుకుపోయింది..' అని దుష్ప్రచారం చేసే కాంగ్రెస్ నాయకులు బ్యారేజీని సందర్శించాలని హితవు పలికారు. సుమారు 10లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద ఉన్న వరద ప్రవాహాన్ని కూడా బ్యారేజీ తట్టుకుని నిలబడిందని, ఇది కాంగ్రెస్ నాయకుల కళ్లకు కనిపించడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైన కాంగ్రెస్ నాయకులు కళ్లతెరిచి ప్రాజెక్టును చూసి మాట్లాడాలన్నారు. చిన్న చిన్న లోపాలను చూపించి మొత్తం ప్రాజెక్టే పనికి రాదనే విధంగా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే ఆగస్టు 2వ తేదీ నాటికి ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలని, లేదంటే తామే వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు, సూర్యాపేట, భువనగిరి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి 50వేలమందికిపైగా రైతులను సమీకరించి వారి చేతుల మీదుగానే కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్‌చేసి కాళేశ్వరం జలాలను తరలించుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయం చేసేందుకు తాము

మిగతా 6వ పేజీలో..



వైద్యులు, ఫార్మసిస్టులకు బదిలీ అర్డర్ అందిస్తున్న రవినాయక్

మల్టీజోన్-1 ఆయుష్ ఉద్యోగుల బదిలీ

వైద్యులు, ఫార్మసిస్టుల బదిలీ అర్డర్‌ల పంపిణీ

47 మంది వైద్యులు, 40 మంది ఫార్మసిస్టుల ట్రాన్స్‌ఫర్

గిర్మాజిపేట, జూలై 26 : సాధారణ బదిలీలలో ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకులు పరిధిలోని మల్టీజోన్-1 పరిధిలోని (పాత వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు) 87మంది ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్యాధికారులు, ఫార్మసిస్టులకు శుక్రవారం బదిలీలు జరిగాయి. హనుమకొండలోని ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయంలో ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ రవినాయక్ బదిలీ ఉత్తర్వులను అందించారు. బదిలీ అయిన వారిలో 47మంది మెడికల్ ఆఫీసర్లు, 40 మంది ఫార్మసిస్టులు ఉన్నారు. ఇందులో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.స్వరూప ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి వేములవాడ (రాజన్న సిరిసిల్ల)కు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో అమినాబాద్ ఆయుర్వేద డిస్పెన్సరిలో పనిచేస్తున్న డాక్టర్ కె.వసంత ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌గా బదిలీపై వస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఫార్మసిస్ట్ బి.కుమారస్వామి హసన్‌పర్తి ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీకి బదిలీ అయ్యారు. అలాగే

మిగతా 8వ పేజీలో

మెరుగైన వసతులు కల్పిస్తాం..

- మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలి..
- వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి
- మార్కెట్ అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశం
- అదనపు కలెక్టర్‌తో కలిసి లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ తనిఖీ

వరంగల్ సిటీ, జూలై 26: వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి మార్కెట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు, వినియోగదారులను అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మార్కెట్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. మార్కెట్లోకి వాహనాలు రాకుండా, వర్షపునీరు నిల్వ లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. మార్కెట్లో శుభ్రత పాటించాలని, ఏ రోజుకారోజు కూరగాయల వేస్టేజీని తొలగించాలని స్పష్టం చేశారు. వాహనాలు పార్కింగ్ ప్లేస్‌లోనే పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. కూరగాయలు విక్రయించేందుకు వచ్చే రైతులు విశ్రాంతి తీసుకునేందుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. హోల్ సేలర్స్, రిటైలర్స్ వారికి కేటాయించిన స్టాల్స్‌లోనే విక్రయించుకోవాలని, ఎక్కడబడితే అక్కడ విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు, మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల, ఈఈ శ్రీనివాస రావు, డీఈ.రవికుమార్, ఏఈ హబీద్దీన్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశంతో క్లీనింగ్ పనులు

లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో కలెక్టర్ తనిఖీ చేసిన గంటల వ్యవధిలోనే ఏనుమాముల మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలెపాక నిర్మల యుద్ధ ప్రాతిపాదికన మార్కెట్లో పారిశుధ్య పనులను చేపట్టారు. మధ్యాహ్నం వరకు ఎక్కడా చెత్త కనిపించకుండా మొత్తం డోజర్, పని వాళ్లతో మార్కెట్ మొత్తం శుభ్రం చేయించారు. కార్యక్రమంలో గ్రేడ్-2 కార్యదర్శి రామోజు రాము, గంగాధర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మార్కెట్ బురదమయంగా మారడంతో సూచనలిస్తున్న కలెక్టర్

సమీకృత భవన నిర్మాణ పనుల పరిశీలన

కూరగాయల మార్కెట్ పక్కన సుమారు రూ.24 కోట్లతో నిర్మిస్తున్న వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు పరిశీలించారు. మార్కెట్ డిజైన్‌ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగ పనులు పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



పాకాల.. కళకళ..

24.6అడుగులకు చేరిన నీటిమట్టం

ఖానాపురం, జూలై 26: జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు నీటి మట్టం శుక్రవారం నాటికి 24.6 అడుగులకు చేరింది. 30.2అడుగుల సామర్థ్యం గల సరస్సు జలకళను సంతరించుకుంది. వానాకాల పంటల సాగుకు సరిపడా సాగునీరు సరస్సులోకి రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. పది రోజులుగా ఆయకట్టులో వరినాట్లు జోరందుకున్నాయి. దీంతో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడడంతో ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి నాట్లు వేయిస్తున్నారు. గత జూలైలో నెలలో వర్షాలు దంచి కొట్టడంతో పాకాల సరస్సు ఇదే రోజు(జూలై 27, 2023న) మత్తడి దూకింది. గతేడాది జూలై 26న పాకాల సరస్సులో 24అడుగుల నీరు ఉండగా అదే రోజు రాత్రి కుంభవృష్టి వర్షం కురియడంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాత్రికి రాత్రే సరస్సులోకి 6 అడుగుల నీరు చేరుకుంది.

డయాగ్నస్టిక్ సేవలు అదుర్స్

- నర్సంపేటలో అందుబాటులో 54 రకాల వైద్య పరీక్షలు
- మైక్రోబయోలజిస్టు, బయోకెమిస్ట్రీ, రేడియాలజిస్టు పోస్టులు ఖాళీ

నర్సంపేట, జూలై 26: నర్సంపేట పట్టణంలోని డయాగ్నస్టిక్ సెంటర్‌లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అభ్యర్థన మేరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన డయాగ్నస్టిక్ సెంటర్‌ను నర్సంపేటకు మంజూరు చేయించారు. భవన నిర్మాణం కోసం రూ.1.25 కోట్లను మంజూరు చేయించగా, 2023, జూలై 1 పర్చువల్ పద్ధతిలో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ డయాగ్నస్టిక్ సెంటర్‌లో 8మంది వైద్య సిబ్బందికిగాను ఐదుగురు విధులు నిర్వర్తిస్తుండగా, మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పైథాలజిస్టు, ఇద్దరు రేడియోగ్రాఫర్లు, డీఈవో, ఫార్మసిస్టులు విధులు నిర్వహిస్తున్నారు. మైక్రోబయోలజిస్టు, బయోకెమిస్ట్రీ, రేడియాలజిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభమైన నాటినుంచి నేటివరకు 39,373 మందికి ఉచిత టెస్టులను నిర్వహించారు. ఈ సెంటర్‌లో ఈసీజీ, రేడియోలజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, మమోగ్రామ్, డెంగీ, బీపీ, షుగర్‌తో సహా 54రకాల టెస్టులను నిర్వహిస్తున్నారు. టెస్టుల కోసం వచ్చిన వ్యక్తుల రోగ నిర్ధారణకు సంబంధించిన సమాచారాన్ని 24 గంటల్లో రోగుల సెల్‌ఫోన్‌లకు మెస్సేజ్‌ల ద్వారా అందిస్తున్నారు. 2023 జూలై 1 నుంచి డిసెంబరు 31 వరకు 13,845 రోగులకు 50,665 రోగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. 2024 జనవరి 1 నుంచి జూలై 25 వరకు 25,528 మంది రోగులకు 86,838 రోగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్ సెంటర్‌లో కేవలం 54 రకాల రోగ నిర్ధా రణ పరీక్షలను నిర్వహిస్తున్నారు.



నర్సంపేటలోని డయాగ్నస్టిక్ సెంటర్



వైద్య కళాశాల ప్రారంభమైతే..

నర్సంపేటలో నిర్మాణ తొలి దశలో ఉన్న వైద్య కళాశాల ప్రారంభమైతే 134 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతోపాటు అత్యవసర వైద్య చికిత్సలు పేదలకు అందించే అవకాశాలు ఏర్పడతాయని వైద్య అధికారుల ద్వారా తెలిసింది. రోడ్డు ప్రమాదాలు, క్యాన్సర్ తదితర ఖరీదైన వైద్య చికిత్సలు వైద్య కళాశాల ప్రారంభమైతే అందులో పనిచేసే వైద్య నిపుణుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందనున్నాయి.

మూడున్నర గంటలు..

(5వ పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు రాలేదని, బీడువారిన భూములకు నీరందించి రైతులకు న్యాయం చేయాలని కోరేందుకు వచ్చామని స్పష్టం చేశారు. తొలుత గంగుల మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్‌చేస్తే అన్నారం, సుందిళ్ల ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా మానేరు డ్యామ్‌ను నింపే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు కన్నెపల్లి పంప్‌హౌస్ కీలకమని, దీనిని రన్ చేస్తేనే ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలకూ నీరందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందున్న ఆయకట్టు మాత్రమే కొనసాగేదని, అనంతరం కొన్ని లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తయారైందని వివరించారు. కాంగ్రెస్ చేసే కుట్రలను తిప్పికొట్టి రైతులకు నీరందించడమే లక్ష్యంగా తాము కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చామన్నారు. ఇంకా ఈ పర్యటనలో మాజీ మంత్రులు సీహెచ్ మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గోపీనాథ్, ఎమ్మెల్సీలు ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, గోరేటి వెంకన్న, తాతా మధుసూదన్, రాజు, సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు లింగపల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీడియో తీసి.. ఎక్స్‌లో అప్‌లోడ్ చేసి..

కేటీఆర్ బృందంతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వచ్చిన మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి కుంగిన 7వ బ్లాక్ వద్ద వరద ఉధృతి, పిల్లర్ల పరిస్థితిని ఓ వీడియో రికార్డు చేశారు. ఆ వీడియోను తన ఎక్స్‌ఖాతాలో అప్‌లోడ్ చేశారు. బ్యారేజీ మొత్తంలో ఒక పిల్లర్ కుంగితే యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, మేడిగడ్డ బ్యారేజీ మేడిపండని వ్యాఖ్యానించడం దారుణమని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పుడంటే ఇప్పుడు నీటిని లిఫ్ట్ చేసే విధంగా కన్నెపల్లి పంప్‌హౌజ్ సిద్ధంగా ఉందని ఇంజనీర్లు చెబుతున్నారని, మేడిగడ్డ బ్యారేజీలో సమస్య ఉంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సమస్య ఉందని నీటిని నిల్వ చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉన్నా కాంగ్రెస్ నాయకులు చేసిన అబద్ధపు ప్రచారాలు ప్రజలకు తెలిసిపోతాయనే దురుద్దేశంతో చేయకుండా లక్షలాది మంది రైతులు ఉసురుపోసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందిస్తే కేసీఆర్ కు గుర్తింపు వస్తుందనే దురుద్దేశంతో ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.



నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట భీమ్లాతండాలో వరినాటు వేస్తున్న ఎస్సై సతీష్

వరి నాటు వేస్తూ.. సందడి చేస్తూ..

సైబర్ నేరాలపై నర్సింహులపేట ఎస్సై అవగాహన

నర్సింహులపేట, జూలై 26: వరినాటు వేస్తూ.. కూలీలు, రైతులతో సందడి చేస్తూ సైబర్ నేరాలపై ఎస్సై గండ్రాతి సతీష్ వినూత్నంగా అవగాహన కల్పించారు. నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట శివారు భీమ్లా తండకు చెందిన బానోతు లక్‌పతి వ్యవసాయ క్షేత్రంతో ఎస్సై గండ్రాతి సతీష్ శుక్రవారం మహిళా కూలీలతో కలిసి వరినాటు వేస్తూ సందడి చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం శుభపరినామమన్నారు. ఇటీవల కాలం నుంచి సైబర్ నేరగాళ్లు రైతులను టార్గెట్ చేసుకొని రైతుల సెల్‌ఫోన్‌లకు లింకులు పంపుతూ వారి ఖాతాలో ఉండబడిన నగదును దోచుకుంటున్నట్లు వివరించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి తమ బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రైతులు, కూలీలు ఉన్నారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, జూలై 26: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసుల తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఎస్సై నవీన్ కుమార్ బృందం తనిఖీలు చేస్తుండగా దర్గాకు చెందిన అఫ్జల్ వద్ద 100 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన అఫ్జల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గంజాయి విలువ రూ.3,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

వడ్డెపల్లి, జూలై 26: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో 42 శాతానికి పెంచాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపట్టి స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసెంబ్లీలో బీసీ కులగణన కోసం జీవో నంబర్ 26 ఇచ్చి రూ.150కోట్లు బడ్జెట్ కేటాయించి, త్వరలో బీసీ కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు పాత రిజర్వేషన్ ప్రకారమే ఆగస్టులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దాడి మల్లయ్యయాదవ్, రవీందర్, తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై పోలీసు కళా బృందం ప్రదర్శన

వరంగల్ క్రైం, జూలై 26: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవనగర్‌లో కొత్త చట్టాలపై అవగాహన, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి పోలీసు కళా బృందంతో కార్యక్రమం నిర్వహించారు. పాటలు, నాటిక ద్వారా కళాబృందం సభ్యులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేయూ సీఐ సంజీవ్ మాట్లాడుతూ.. యువకులు మత్తు పదార్థాల బారినపడి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దన్నారు. గంజాయి అమ్మినా, సేవించినా 8712685257 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవిందర్, కళా బృందం ఇన్‌చార్జి నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, విక్రమ్‌రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.



కళాజాతలో మాట్లాడుతున్న సీఐ సంజీవ్

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 26: ఆగస్టు 17 నుంచి కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్‌డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17, 20, 22, 24, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

8 నుంచి ఎంసీఏ సెమిస్టర్ పరీక్షలు

ఆగస్టు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంసీఏ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8, 13, 17, 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

ఎంబీఏ సెమిస్టర్ పరీక్షలు కూడా..

ఆగస్టు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంబీఏ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8, 13, 17, 20, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

7 వతేదీ నుంచి పీజీ కోర్సుల ఎగ్జామ్స్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, సైకాలజీతోపాటు ఇతర పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు ఆగస్టు 7 నుంచి నిర్వహిస్తామని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

వరంగల్ ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా రవీందర్

బాలసముద్రం, జూలై 26: వరంగల్ రీజియన్‌లో అకౌంట్ ఆఫీసర్‌గా ఎల్.రవీందర్‌ను నియమిస్తూ శుక్రవారం ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ అకౌంట్ ఆఫీసర్‌గా పని చేసిన లావణ్య అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే, ఆమె స్థానంలో హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో పీఎఫ్ ట్రస్టు ఏవోగా పనిచేస్తున్న రవీందర్‌ను వరంగల్ ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా నియమిస్తూ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.



ప్రభాకర్ తన హోటల్‌లో ఏర్పాటు చేసిన సందేశాత్మక కవితలు, ఓటును అమ్ముకోవద్దని ప్రచారం చేస్తున్న ఉత్తమ పౌర సమాజం నాయకులు

సమాజ చైతన్యమే లక్ష్యంగా..

ఓటును అమ్ముకోవద్దని, మద్యం మానాలంటూ విస్తృత ప్రచారం ● పదిహేనేళ్లుగా శివునిపల్లిలో ఓ హోటల్ యజమాని కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 26: ఆయన ఓ చిన్న హోటల్ యజమాని. ఆ హోటల్ నడుపుకొంటూ వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తుంటారు. అలాంటి ఓ సాధారణ వ్యక్తి సమాజ చైతన్యమే లక్ష్యంగా పదిహేనేళ్లుగా తన వంతు కృషి చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ తన హోటల్‌కు వచ్చే వారిలో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనే.. స్టేషన్‌ఘన్‌పూర్ జంట పట్టణం శివునిపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న హోటల్ గంగా జమున యజమాని వై.ప్రభాకర్. సందేశ కవితలు ఏర్పాటు చేయడంతో పాటు హోటల్‌కు వచ్చే వారికి తన కవితలు వినిపిస్తూ ఆలోచింపజేస్తున్నారు. ఏటా జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు. మద్యపానంతో కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు ఉత్తమ పౌర సమాజం పేర సంఘం ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్ల క్రితమే శివునిపల్లిలో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసిన ప్రభాకర్ 'ప్రలోభాలకు లొంగకుండా ఓటేద్దాం, సమస్యలపై నిలదీద్దాం' అంటూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అభ్యర్థులు కూడా నిజాయితీగా ఉండాలని, అహర్నిషలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని కోరుతున్నారు.

మహనీయులను స్మరించుకునేందుకు..

జాతీయ నాయకులు, మహనీయులు, కవులు, రచయితలు అందించిన పోరాట స్ఫూర్తిని నిత్యం స్మరించుకోవాలన్న సంకల్పంతో ఏటా వారి జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు ప్రభాకర్. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, చాచా నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రీ, నేతాజీ, స్వామీ వివేకానంద, బీఆర్ అంబేద్కర్, కాళోజీ, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ తదితరుల కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఇక స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వేడుకలను ఎంతో ఉత్సాహంగా చేపడుతున్నారు.

నిషా బినా పీనేకా సంఘ్ సారథిగా...

మద్యపానం వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్యం చేస్తూ.. శివునిపల్లి పట్టణంలో చాలా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. మద్యం తాగని వారితో నిషా బినా పీనేకా సంఘ్ పేర సంఘం ఏర్పాటు చేశారు. 'మద్యం మానండి, కుటుంబాలను బాగా చూసుకోండి' అంటూ ఇప్పటికీ విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కొందరు మారినా చాలు : ప్రభాకర్

శివునిపల్లిలో 20 ఏళ్లుగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ ప్రయత్నంలో కొందరు మారినా చాలు. ఎంతో కొంత ప్రయత్నం చేయడం మంచిది కదా. మద్యం తాగని వారితో 'నిషా బినా పీనేకా సంఘ్' ఏర్పాటు చేసి ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టాం. 18 ఏళ్ల నుంచి చిన్న కవితలను రాసి వాటిని ముద్రించి ప్రదర్శిస్తున్నాం. ప్రజలు నిజాయితీగా ఓటువేయాలని కోరుతూ ఉత్తమ పౌర సమాజం పేర సంఘాన్ని ఏర్పాటు చేశాం.

రీఫండ్ కోసం తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

పోలీసు కమిషనరేట్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డీసీపీ రవి

వరంగల్ క్రైం, జూలై 26: ఆదాయం పన్ను రీఫండ్ కోసం తప్పుడు వివరాలతో రిటర్న్ సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి హెచ్చరించారు. ఆదాయం పన్ను రిటర్న్‌పై పోలీస్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆదాయ పన్ను అధికారి మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు డీసీపీ రవి మాట్లాడారు. తప్పుడు సమాచారంతో ఆదాయ పన్ను రిటర్న్ సమర్పించడం నేరమన్నారు. రీఫండ్ కోసం తప్పుడు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేయకూడదన్నారు. ఒకవేళ ఇచ్చినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఆదాయ పన్ను అధికారి మహేందర్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ వేతన ఉద్యోగులు తప్పుడు సమాచారంతో తమ ఆదాయ పన్ను రిటర్న్ సమర్పించి రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్ క్లెయిమ్ చేసుకుంటున్నట్లు వెలుగు చూసిందన్నారు. ఇలాంటి వారిని గుర్తించి నోటీసులు పంపామన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే ఆదాయ పన్ను చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏవో రామకృష్ణ, ఏసీపీలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

సివిల్ సర్వీస్ శిక్షణను వినియోగించుకోవాలి

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 26: 2024-25 ఏడాదికి గాను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న ప్రిలిమినరీ పరీక్షలకు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం హైదరాబాద్ అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో సివిల్ సర్వీస్ అప్టిట్యూడ్ టెస్ట్ (సీఎస్ఏటీ) ప్రవేశ పరీక్ష గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. గుర్తింపు కలిగిన వర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, రూ.3లక్షల వార్షిక ఆదాయం కలిగిన వారందరూ అర్హులేనన్నారు. దరఖాస్తులు జూలై 31 వరకు చేసుకోవాలని, అలాగే దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 8న పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ http://tsstudycircle. co.in/లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్, ఎస్సీ అధ్యయన సంస్థ వరంగల్ గౌరవ డైరెక్టర్ డాక్టర్ కె.జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎక్స్ రే మిషన్



వరంగల్ మెడికల్, జూలై 26: అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు ఉపయోగించే ఎక్స్‌రే మిషన్ నిరూపయోగంగా మారింది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఉపయోగించే నాథేడు కరువయ్యాడు. ఎంజీఎంలోని ఎస్ఎన్‌సీయూ వార్డులో అప్పుడు పుట్టిన పిల్లల్లో అవలక్షణాలు గుర్తించేందుకు మొబైల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రభుత్వం పంపించింది. ఇందుకోసం ఓ ఆపరేటర్‌ను నియమించినప్పటికీ రెండు గంటలు మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఇందులో ఉన్న డాక్టర్లు ఈ నిర్ధారణ పరీక్ష కోసం టెక్నీషియన్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఎక్స్‌రే మిషన్‌తోపాటు వైద్యులు ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతో పిల్లలకు వైద్యం అండం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అత్యవసర విభాగంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండే విధంగా టెక్నీషియన్‌లను నియమించాలని రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ఎంజీఎంలో కుక్కల స్వైర విహారం

వరంగల్ మెడికల్, జూలై 26: ఎంజీఎం ఆస్పత్రిలోని పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా పిల్లల వార్డులో కూడా రాత్రివేళల్లో దర్శనమిస్తున్నాయి. చిన్నపిల్లలను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నప్పటికీ కుక్కల వల్ల ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రాత్రి వేళల్లో పిల్లలకు కాపలాగా ఉంటున్నారు. అటెండెన్స్ మధ్య కుక్కలు కూడా సహవాసం చేస్తున్నాయని భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఎలుకలు కొరికిన విధంగా పిల్లలపై దాడికి కుక్కలు దిగకముందే తగిన చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎంజీఎంలో తిరుగుతున్న కుక్క

జీర్ణించుకోలేని విషాదం

- 'కొండాయి' గుండెకోతకు ఏడాది
- గతేడాది జూలై 27న జంపన్నవాగు వరదకు 8 మంది బలి
- గ్రామాన్ని ముంచెత్తిన జలప్రళయం
- మరువలేకపోతున్న పల్లె జనం


నాటి వరదలకు మునిగిపోయిన కొండాయి గ్రామం

ఏటూరునాగారం రూరల్, జూలై 26: పచ్చని అడవి పల్లెను వరద మింగేసింది. వాగు ఉప్పొంగి ఊరు ఊరంతటినీ నీటముంచింది. ఏకంగా ఎనిమిది మందిని బలిగొంది. అనేక మంది ఆస్తులను నష్టపర్చింది. సరిగ్గా ఏడాది క్రితం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయిలో జరిగిన ఈ దుర్ఘటన తీవ్ర గుండెకోతను మిగిల్చింది. గత ఏడాది భారీ వర్షాలకు మహోగ్రరూపం దాల్చిన జంపన్నవాగు జలప్రళయాన్ని సృష్టించింది. ఇది జరిగి ఏడాది పూర్తయినా ఆ విషాదం ఛాయలు ఆ గ్రామాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. కళ్లెదుటే తిరిగిన వ్యక్తులు చూస్తూ చూస్తుండగానే వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడాన్ని ఆ పల్లె ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రశాంత పల్లెలో పెను విషాదం

ప్రశాంతంగా ఉన్న కొండాయి గ్రామంలో పెను విషాదం చోటు చేసుకుంది. గత ఏడాది జూలై 27న ఒక్కసారిగా ప్రళయం వచ్చినట్టయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు ఉగ్రరూపం దాల్చింది. ఎప్పటిలాగే వాగు ఉప్పొంగిందని అనుకున్నారు ఆ పల్లె వాసులు. ఉదయం 9 గంటల వరకు మామూలుగానే ప్రవహించిన జంపన్నవాగు మధ్యాహ్నానికి మహోగ్రరూపం దాల్చింది. గంటల వ్యవధిలోనే వరద ఇళ్లను ముంచెత్తింది. సాయంత్రం 3గంటలకు చరిత్రలో ఎన్నాడూ లేని విధంగా కొండాయి గ్రామం అంతటినీ జంపన్నవాగు చుట్టు ముట్టింది.

ఎనిమిది మంది బలి



జంపన్నవాగు వరదంతా ఇళ్లల్లోకి భారీగా చేరుకోవడంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వరదను దాటి వెళ్తున్న క్రమంలో ఎనిమిది మంది కొట్టుకుపోయి మృతి చెందారు. వీరిలో దబ్బకట్ల సమ్మక్క, ఎమ్డీ అజ్జు, ఎమ్డీ షరీఫ్, ఎమ్డీ మహబూబ్‌ఖాన్, ఎమ్డీ మజీద్ ఖాన్, ఆయన భార్య లాల్‌బీ, రషీద్, ఆయన భార్య కరీమాబీ వరదలో కొట్టుకపోయి ప్రాణాలు కోల్పోయారు. క్షణాల వ్యవధిలోనే ఎనిమిది మందిని జంపన్నవాగు బలిగొంది. అలాగే మూగ జీవాలు వాగులో కొట్టుకుపోయాయి. ఇళ్లు నేలమట్టం కావడమే కాక సామగ్రి అంతా నీళ్లపాలైంది. గ్రామస్థులు నిలువ నీడలేక నిరాశ్రయులయ్యారు. ఈ జలప్రళయం ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

కల్వర్టే ప్రాణాలను మిగింది..

మల్యాల, కొండాయి గ్రామాల మధ్య కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల మధ్య ఆశ్రమ పాఠశాలకు కొద్ది దూరంలో కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో రోడ్డును తవ్వి నీళ్లు వెళ్లేందుకు సిమెంట్ పైపులను ఏర్పాటు చేశారు. వాటిపై మట్టి పోసి వదిలేశారు. దీంతో జంపన్నవాగు వరద గ్రామాన్ని చుట్టు ముట్టిన క్రమంలో కల్వర్టులు నీట మునిగి దానిపై పోసిన మట్టి కొట్టుకుపోయింది. వాగు గ్రామాన్ని చుట్టుముట్టడంతో ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రజలు ఆరహదారి వెంట బయల్దేరారు. అందులో కొంతమంది ఆ కల్వర్టు దాటి వెళ్తుండగా దానిపై మట్టి కొట్టుకుపోవడంతో లోతులోకి దిగి వరదలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు.

'సురక్షితం' లేని హామీ

జంపన్నవాగు మహోగ్రరూపానికి ప్రాణ, ఆస్తి నష్టాన్ని చవిచూసిన కొండాయిపై అప్పట్లో పాలకుల హామీల వర్షం కురిసింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేశారు. అంతేకాకుండా పూర్తిగా నష్టపోయిన కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఇదే క్రమంలో కొండాయి వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అనంతరం అది కార్యరూపం దాల్చలేదు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేయలేకపోయింది.



కొండాయి వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కొండాయి వాసులు (ఫైల్)

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో సీపీ అంబర్‌కిషోర్ ఝా, నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26: వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్-17బాల బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ ముగిసింది. శుక్రవారం క్లబ్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్స్‌లో తలపడిన పలు జట్ల క్రీడాకారుల ఆట తీరును తీసి హర్షం వ్యక్తం చేశారు.

మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో శౌర్యకిరణ్ (వరంగల్), కీర్తి మంచాల (జనగామ) బీట్ శ్రీఆదిత్య బొమ్మకంటి (రంగారెడ్డి) రిషితాపాండే (రంగారెడ్డి) జోడి మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన హోరాహోరీపోరులో శ్రీఆదిత్య, రిషితపాండే జోడి విజయం సాధించారు. దీంతో శౌర్యకిరణ్, కీర్తి మంచాల ద్వితీయస్థానంతో సరిపెట్టుకున్నారు. అదే విధంగా బాలుర సింగిల్స్‌లో శశాంక్ వనమాల (రంగారెడ్డి) ప్రథమ స్థానం, సాయి నక్షేత్ భటరాజ్ మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల సింగిల్స్‌లో కీర్తి మంచాల(జనగామ) ప్రథమ, అల్లూరి అక్షయ చౌదరి మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా బాలుర డబుల్స్‌లో సాయి సిద్ధార్థ్ రాయప్రోలు, యువసూర్య జాగర్లముడి (హైదరాబాద్) ధృవ్ పరిశేద్ సితి, వివేక్ బొల్లం రంగారెడ్డి జోడి అనివార్య కారణాల వల్ల పోటీలో పాల్గొనకపోవడంతో సాయి సిద్ధార్థ్, యువసూర్యల జోడి విజయం సాధించారు. బాలికలడబుల్స్‌లో లక్ష్మీరిధిమా దేవినేని, సరయు సూర్యనేని (హైదరాబాద్)అనుసంజన మురళి, గాదే స్తుతి గ్రేసిరెడ్డి (రంగారెడ్డి) జోడిపై లక్ష్మిరిధిమా దేవినేని, సరయు సూర్యనేని విజయం సాధించారు.

విజేతలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకొని పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనే సమయంలో కష్టంగా భావించకుండా సంతోషంగా సాధన చేస్తే అనుకున్న గమ్యాన్ని అందిపుచ్చుకోవచ్చునన్నారు. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన అసోసియేషన్ బాధ్యులను సీపీ అభినందిచారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి చాంపియషన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.రవీందర్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.జితేందర్‌రెడ్డి, మోహన్ రావు, కోశాధికారి డి.నాగకిషన్, కోచ్ కొమ్ము రాజేందర్, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతుడు అశోక్ అంత్యక్రియలు పూర్తి

అశ్రునయనాలతో వీడ్కోలు పలికిన మహ్మద్‌గౌస్‌పల్లి వాసులు



ములుగు, జూలై 26: తాడ్వాయి-గుండాల సరిహద్దు దామెరతోగు అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు దళసభ్యుడు నల్లమారి అశోక్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలోని వైకుంఠధామంలో కుటుంబసభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అశోక్ మృతదేహాన్ని గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి మార్చురీలో భద్రపరిచి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా శుక్రవారం ఉదయం మార్చురీ వద్దకు సోదరుడు కుమారస్వామి, అక్క భద్రక్క చేరుకొని అశోక్ మృదేహాన్ని గుర్తించారు. పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ నేతృత్వంలో వైద్యులు పోస్టుమార్టం జరిపించి మృతదేహాన్ని వారికి అప్పగించారు. స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం అయినప్పటికీ అశోక్ సోదరుడు కొన్నేళ్లుగా ములుగు జిల్లా ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో మహ్మద్‌గౌస్‌పల్లికి మృతదేహాన్ని తరలించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపించారు. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఇంటివైపు కన్నెత్తి చూడని అశోక్ తన తండ్రి సంవత్సరీకం రోజునే ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటికి తీసుకువెళ్లకుండా నేరుగా శ్మశాన వాటికకు మృతదేహాన్ని తరలించారు. అశోక్ చితికి ఆయన సోదరుడు కుమారస్వామి నిప్పంటించారు. అమరుల బంధుమిత్రుల సంఘం సభ్యులు జోహార్లు అర్పించారు.


ములుగు ఏరియా ఆస్పత్రి వద్ద పోలీసులు


అశోక్ కుటుంబ సభ్యులు, బంధువులు

గాంధీ ఫెల్లోషిష్‌కు రామేశ్వరం

కేయూ క్యాంపస్, జూలై 26: 2024 ఏడాదికి గాను భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి పూణే శాఖ నేతృత్వంలోని గాంధీ ఫెల్లోషిప్ ప్రొగ్రాంకు కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరం ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి తమకు సమాచారం అందినట్లు రామేశ్వరం తెలిపారు. గాంధీ ఫిలాసఫీలో భాగమైన ప్రకృతి వైద్యం (నేచర్ క్యూర్)పై హైదరాబాద్‌లో గల డాక్టర్ బి.వెంకట్‌రావు గాంధీనేచర్ క్యూర్ కాలేజీపై 6 నెలల కాలంలో ప్రొఫెసర్ రామేశ్వరం సమగ్రమైన పరిశోధనలు, పుస్తకాల సేకరణ, రిపోర్టులను రూపొందించాల్సి ఉంటుందని నిర్వహకులు సూచించారు. కాగా ప్రొఫెసర్ రామేశ్వరం తన సొంత ఖర్చులతో హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటర్నేషనల్ న్యాచురోపతి లైబ్రరీ, రిసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. రామేశ్వరంను రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పెద్దమల్ల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఎంజీఎం మూడో గేటు ఓపెన్

వరంగల్ మెడికల్, జూలై 26: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మూడోగేట్ కొన్నేళ్ల తర్వాత శుక్రవారం తెరుచుకుంది. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆస్పత్రికి మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. ఒకటో గేటు క్యాజువాలిటీ,ఏ మర్జెన్సీ, పిల్లల వార్డుకు వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. ఇక రెండో గేటు మీదుగా ఉదయం ఓపీ, పరిపాలన భవనం, ప్రధాన వార్డుల్లోకి సులువుగా వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు వైపు ఉన్న మూడో గేటును కొన్నేళ్లుగా తాళం వేసి పెట్టారు. వాహనాల రాకపోకలను నిషేధించారు. ఆ వైపు వెళ్లాలనుకునే రోగులకు గేటు మూసి ఉండటంతో అసౌకర్యంగా ఉండేదని రోగులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎట్టకేలకు శుక్రవారం నుంచి మూడో గేటు ద్వారా వాహనాల రాకపోకలకు ఎంజీఎం అధికారులు అనుమతించారు.



గుడిబడిలో వైద్య శిబిరం

వరంగల్‌సిటీ, జూలై 26: కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల(గుడిబడి)లో శుక్రవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 74 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుట్ట మోహన్, ఏఎన్‌ఎం గీత, ఆశా కార్యకర్త పునీత, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఇంచార్జి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

స్కానింగ్ ఎలా?

- రేడియాలజిస్టుల బదిలీతో నిలిచిన సేవలు
- వారమైనా కొత్తవారిని నియమించని ప్రభుత్వం
- సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో ఇబ్బంది పడుతున్న గర్భిణులు

గిర్మాజీపేట, జూలై 26 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో వారం రోజులుగా స్కానింగ్‌లు నిలిచిపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రి రేడియాలజిస్టులు డాక్టర్ వనజ, డాక్టర్ రాంబాబులు బదిలీ కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నిష్ణాతులైన వైద్యులు క్లిష్టతరమైన కేసులను సురక్షితంగా వైద్య చికిత్సలు చేస్తారనే నమ్మకంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం సుమారు 500 మంది అవుట్ పేషంట్‌లు, 200 మంది ఇన్‌పేషంట్‌లు ఆస్పత్రిలో ప్రసవాలు, ఆపరేషన్‌లు తదితర వైద్య సేవలు పొందుతారు. అయితే గర్భిణులకు సంబంధించి టిఫ, ఫిటల్ డాప్లర్, అబ్డామిన్, న్యూరో, రోటిన్ గర్భిణీ స్కానింగ్‌లు చేస్తుంటారు. వేల రూపాయలు వ్యయం అయ్యే అన్ని రకాల స్కానింగ్‌లు సీకేఎం ఆస్పత్రిలో ఉచితంగా చేస్తుండటంతో నిత్యం స్కానింగ్ సెంటర్ రద్దీగా ఉంటుంది. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లుగా రేడియాలజిస్టులు వనజ, రాంబాబులు రోజుకు సుమారు 100కు పైగా స్కానింగ్‌లు చేసేవారు. ఆస్పత్రి రేడియోలజీ వైద్య సేవలపై గత ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు పలుమార్లు వైద్య శాఖ సమీక్షలో సీకేఎం ఆస్పత్రి రేడియాలజీ వైద్యులు పనితీరును రాష్ట్ర స్థాయిలో అభినందించారు. అయితే వనజ, రాంబాబులు బదిలీ అవడంతో వారం రోజులుగా ఆస్పత్రిలో స్కానింగ్‌లు నిలిచి పోయాయి. నేటికీ ప్రభుత్వం రేడియాలజిస్టులను నియమించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'నిలిచిన స్కానింగ్, ఎక్స్‌రేలు.. బదిలీ కౌన్సెలింగ్ వెళ్లిన వైద్యులు, సిబ్బంది' పేరుతో కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. కథనంలో చెప్పినట్లు గానే రేడియాలజిస్టులు బదిలీ అవడంతో స్కానింగ్‌లు పూర్తిగా నిలిచిపో యాయి. స్కానింగ్‌లు నిలిచిపోవడంతో వేల రూపాయలు వ్యయం చేసి ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే బుధ, గురు వారాల్లో పీజీ స్టూడెంట్స్ కొందరు రోగులకు సాధారణ స్కానింగ్‌లు చేశారు. ముఖ్యమైన టిఫ, ఫిటల్ డాప్లర్, న్యూరో తదితర స్కానింగ్‌లు చేయాలంటే రేడియాలజిస్టులు తప్పని కావాల్సిందే. ప్రస్తుతం ఆస్పత్రికి వచ్చేందుకు రేడియాలజిస్టులు అందుబాటులో లేకపోవడంతో స్కానింగ్‌లు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కాకతీయ వైద్య కళాశాలకు బోధన ఆస్పత్రిగా ఉన్న వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రేడియాలజిస్టులు లేకపోతే రోగులకు ఇబ్బందులే కాకుండా పీజీ సీట్లకు కూడా ఇబ్బందులు తప్పవంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారదలు స్పందించిన వెంటనే రేడియాలజిస్టులు వచ్చేలా చొరవ చూపాలని గర్భిణులు, వారి బంధువులు కోరుతున్నారు.



గుండెపోటుతో ఎంసీపీఐ కార్యదర్శి మృతి

గీసుగొండ, జూలై 26: గీసుగొండకు చెందిన ఎంసీపీఐ మండల కార్యదర్శి, జిల్లా సభ్యుడు కందికొండ కుమారస్వామి(50) గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం వరంగల్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయనకు అక్కడ గుండెపోటు రావటంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. ఆయనకు భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎంసీపీఐ పార్టీలో చురుకుగా పనిచేస్తూ పేదప్రజలకు అండగా నిలిచారు. కాగా శుక్రవారం గీసుగొండలో కుమారస్వామి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోనె కుమారస్వామి, వరంగల్, హన్మకొండ జిల్లాల పార్టీ కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, నాయకులు మంద రవి, నాగెల్లి కొమురయ్య, రాగసుధ, చంద్రయ్య, కనకం సంధ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు జావీద్, ప్రవీణ్ నివాళులర్పించారు.

పేద కుటుంబానికి చేయూత

సంగెం, జూలై 26: మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెట్టుపల్లి భాస్కర్ ఇటీవల మృతిచెందగా, రూ.71వేలను మండల నాయకులు అందించారు. శుక్రవారం మృతిని ఇంటికి వెళ్లి బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.50వేల బాండ్, రూ.20వేల నగదు, బియ్యం కుటుంబ సభ్యులకు అందించారు. పార్టీలో పనిచేస్తూ ఆటో నడుపుతూ భాస్కర్ కుటుంబాన్ని పోషిస్తుండేవాడని, వాట్సాప్ ద్వారా భాస్కర్ పరిస్థితులను మండల కేంద్రానికి చెందిన పులి రాజశేఖర్ వివరించడంతో పలు గ్రామాలకు చెందిన వారు విరాళాలను అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు కందకట్ల నరహరి,మెట్టుపల్లి రమేష్, కోడూరి సదయ్య, ఆగపాటి రాజుగౌడ్, మెట్టుపల్లి ఏలియా, మునుకుంట్ల మోహన్, మెట్టుపల్లి ప్రవీణ్, గుండేటి వాసులు అందించారు.

గంజాయి తరలిస్తున్న నిందితుడి అరెస్టు

కరీమాబాద్, జూలై 26: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ నిందితుడు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నగరంలోని ఏసీ రెడ్డినగర్‌కు చెందిన సురావు ప్రణీత్ మరో ముగ్గురితో కలిసి నెల రోజుల క్రితం మహారాష్ట్ర, సీలేరు నుంచి 15కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. 13కిలోలు నగరంలో పలు చోట్ల విక్రయించాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు కిలోల గంజాయిని తరలిస్తున్న క్రమంలో ఏసీ రెడ్డినగర్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ప్రణీత్‌ను రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.

రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సంగెం, జూలై 26: మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సర్వోదయ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా రక్షణ చట్టాలపై సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సర్వోదయ సంస్థ 15ఏళ్లుగా హింసకు గురవుతున్న సహాయక కేంద్రాల ద్వారా 27 వేల కుటుంబాలకు చేయూతనిస్తోందన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సఖీవన్ స్టాఫ్ కేంద్రాల ద్వారా 24గంటలపాటు అందుబాటులో ఉంటూ సేవలు అంది స్తున్నామన్నారు. కార్యక్రమంలో సంగెం ఎస్సై నరేష్, సర్వోదయ సంస్థ సభ్యులు కవిరాజ్, అక్తర్‌వాణి, సఖీవన్ స్టాఫ్ సెంటర్ అడ్మిన్ శ్రీలత, లీగల్ కౌన్సిలర్, శోభారాణి పాల్గొన్నారు.

సీపీని కలిసిన కమాండెంట్ రాంప్రకాశ్

శంభునిపేట, జూలై 26 : మామునూరులోని టీఎస్ఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాశ్ వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా రాంప్రకాశ్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసి మొక్కను అందించారు.



సీపీకి మొక్కను అందిస్తున్న కమాండెంట్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ

వరంగల్ సిటీ, జూలై 26: సైబర్ క్రైం, గంజాయి, మాదకద్రవ్యాలతో యువత అప్రమత్తంగా ఉండాలని మామునూర్ ఏసీపీ తిరుపతి సూచించారు. సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు శుక్రవారం ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో ఏసీపీ సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. గంజాయి, మాదకద్రవ్యాల వాడకంతో వచ్చే సమస్యలను వివరించారు. సైబర్ క్రైం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని, అందుకోసం ప్రత్యేకం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1930ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏనుమాముల సీఐ పులి రమేష్, ఎస్ఐ.నర్సింగరావు, పోలీసులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ జంక్షన్‌లో యువతకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ తిరుపతి

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి చల్లా పరామర్శ

సంగెం, జూలై 26: తీగరాజుపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ ఇటుకాల బాబురావు అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, సమాచారం అందుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఇంటికివెళ్లి బాబురావు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల సదానందం, మాజీ వైస్ ఎంపీపీ మల్లయ్య నాయకులు ఇటికాల లక్ష్మణ్‌రావు, ధనూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొండా దంపతులే నాకు న్యాయం చేయాలి

- నవీన్‌రాజ్ లైంగికంగా వేధించాడని చెప్పినా పట్టించుకోవడం లేదు
- సీపీ, ఏసీపీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదు
- విలేకరుల సమావేశంలో అంజనీదేవి ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు అంజనీదేవి

వరంగల్‌సిటీ, జూలై 26: కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రాజ్ తనను లైంగికంగా వేధించాడని గతంలోనే కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు దృష్టికి తీసుకెళ్లానని, తనకు న్యాయం చేస్తామని వారు నాడు హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని బాధితురాలు అంజనీదేవి మీడియా ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అండతో నవీన్‌రాజ్ అనే వ్యక్తి తనను లైంగికంగా వేధించాడని, దాంతో తనకు న్యాయం చేయాలని నాడు కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మరోవైపు నవీన్‌రాజ్‌పై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, జీరో ఎఫ్ఐఆర్ చేశారని, నవీన్‌రాజ్ తన పలుకుబడితో దానిని తీసేయించుకున్నారని ఆరోపించారు. దానికి సంబంధించిన పత్రాలను మంత్రి కొండా సురేఖకు ఇచ్చామని, ఇప్పుడా డాక్యుమెంట్లు ఆమె వద్దే ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, సురేఖ మంత్రి అయ్యాక కూడా న్యాయం చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వరంగల్ సీపీకి, ఏసీపీకి, ఇంతేజార్‌గంజ్ సీఐ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతులు ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని ఆమె వాపోయారు.

మంత్రి సురేఖకు సన్మానం

వరంగల్ కల్చరల్, జూలై 26: పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ సంబంధించి సర్వీస్ రూల్స్‌ను సవరించినందుకు దేవాదాయ శాఖ దేవాలయ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి అర్చకులతో ఆశీర్వచనం, శాలువాతో సన్మానం, ప్రసాదాలను అందజేశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు మంత్రిని హైదరాబాద్‌లోని స్వగృహంలో కలిశారు. సీనియార్టీ ప్రకారం వీలైనంత త్వరగా లీస్టు తయారు చేసి ప్రమోషన్లు ఇవ్వాలని మంత్రికి తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు తెలిపారు.



మంత్రి కొండా సురేఖను సన్మానిస్తున్న దేవాదాయ శాఖ ఉద్యోగులు

కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులతోపాటు ఇతర జిల్లాలోని ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.

ఎంసీపీఐ ఆధ్వర్యంలో నిరసన



సంగెంలో నిరసన తెలుపుతున్న నాయకులు

సంగెం, జూలై 26: బడ్జెట్‌లో కేంద్ర తెలంగాణకు మొండిచేయి చూపిందని నిరసిస్తూ ఎంసీపీఐ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపులో పక్షపాతం చూపిందని ఆరోపించారు. బడ్జెట్‌లో రూ.50వేల కోట్లను కేటాయించి అభివృద్ధికి సహకారం అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి, టెక్స్‌టైల్ పార్కుతో పాటు పరిశ్రమలకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను ఓలకబోసిందన్నారు. గోనే రాంచందర్, సోమిడి రవి, అశోక్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠినచర్యలు : సీఐ

గీసుగొండ, జూలై 26: గుడుంబా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని గీసుగొండ సీఐ బాబులాల్ హెచ్చరించారు. గుడుంబా, నల్లబెల్లం, గం జాయి నిర్మూలనపై పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహి ంచారు. సీఐ మాట్లాడుతూ గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలను ఎక్కడ విక్రయించినా, స్థానికులు సామాజిక బాధ్యతతో పోలీసులకు సమాచారం అందిం చాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచు తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ రియాజుద్దిన్, ఎక్సైజ్ సీఐ తాతాజీ, ఎస్ఐలు కుమా ర్, జ్యోతి, విద్యుత్‌శాఖ ఏఈ సంపత్‌రెడ్డి, కార్యదర్శి శంకర్‌రావు పాల్గొన్నారు.

మల్టీజోన్-1 ఆయుష్ ఉద్యోగుల బదిలీ

(5వ పేజీ తరువాయి)

ఎలు కుర్తి ఆయుర్వేద డిస్పెన్సరి ఫార్మసిస్ట్ బి.శంకర్, లక్ష్మిపూర్ ఆయుర్వేద డిస్పెన్సరి ఫార్మసిస్ట్ కె.రమేష్‌బాబు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఆయుర్వేద బోధన ఆస్పత్రి కార్యాలయం సూపరింటిండెంట్ బిల్లా కుమారస్వామి ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయానికి, ఇక్కడ పనిచేస్తున్న పులిరాజు వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రికి బదిలీ అయ్యారు. వీరిలో డాక్టర్ కె.వసంత, కార్యాలయ సూపరిం టిండెంట్‌లు నూతన విధుల్లో చేరారు. మిగిలిన వైద్యులు, ఫార్మసిస్ట్‌లు శనివారం విధుల్లో చేరనున్నారు. బదిలీ ఉత్తర్వులు తీసుకునేందుకు ఆయుష్ వైద్యులు, ఫార్మసిస్ట్‌లు తరలిరావడంతో శుక్రవారం ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయం రద్దీగా మారింది. అయితే సీనియర్ మెడికల్ ఆఫీసర్లు, నాల్గవ తరగతి సిబ్బంది బదిలీ ఉత్తర్వులు శనివారం రానున్నట్లు తెలిసింది.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి:సీఐ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శివకుమార్

వరంగల్ చౌరస్తా, జూలై 26: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ హెచ్చరించారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో 15మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలు చేయకుండా సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు ఎవరు సేవించకుండా అవగాహన కల్పించాలని తెలిపారు.

నాస్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



మాట్లాడుతున్న డీఈవో డి.వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 26: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు డీఈవో డి.వాసంతి ప్రారంభించారు. మట్టెవాడ, శంభునిపేట తదితర పాఠశాల కేంద్రాల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వాసంతి ప్రారంభించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సుభాష్, డీసీఈబీ సెక్రెటరీ కృష్ణమూర్తి, ఎంఈవో ఎన్. విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు అరుణ, శారదబాయి పాల్గొన్నారు.

వెంకటేశ్వర్‌రావుకు పలువురి పరామర్శ



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శంభునిపేట, జూలై 26: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ వేంకటేశ్వర్‌రావును శుక్రవారం పలువురు ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. 17వ డివిజన్ గుంటూరుపల్లిలో సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వరంగల్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత నాయినేని సంపత్‌రావు తదితరులు ఉన్నారు.

అమరవీరుల స్మరణలో విజయ్ దివస్

శంభునిపేట, జూలై 26 : భారతమాత రక్షణలో అసువులు బాసిన కార్గిల్ అమరవీరుల స్మరణతో శుక్రవారం విజయ్ దివస్‌ను నగర ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నాయకులు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో శంభునిపేటలో విజయ్ దివస్‌ను నిర్వహించారు. రవీందర్ మాట్లాడుతూ సైనికులు ప్రాణాలు పణంగా పెట్టి దేశాన్ని రక్షించటం వల్లే మనమంతా దేశంలో ప్రశాంతంగా ఉన్నామన్నారు. వీరోచితంగా పోరాడి కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌ను ఓడించిన మన సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం కరీమాబాద్‌లోని వీర జవాన్ మాడిశెట్టి సతీష్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్‌ల అధ్యక్షుడు ఆకుతోట రాజు, కర్నె వాసుదేవ్, బోరిగం నాగరాజు, తాళ్లపల్లి అర్జున్‌గౌడ్, బక్కి రంజిత్, ఆరె కార్తిక్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్‌ను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొని దేశ రక్షణలో సైనికుల పాత్ర, వారి త్యాగం, ధైర్యసాహసాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాల్యా నాయక్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రహీముద్దీన్‌సోమయ్య, భగీరథ పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగం చిరస్మరణీయం

మిల్స్‌కాలనీ: కార్గిల్ వీరుల త్యాగం చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం ఉర్సు సీఆర్‌సీ సెంటర్‌లోని వీరజవాన్ మాడిశెట్టి సతీష్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్‌సా, నాయకులు వన్నాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, డివిజన్ అధ్యక్షుడు ఆకుతోట రాజు, కర్నె వాసుదేవ్, కిసాన్ మోర్చా నాయకులు బైరి నాగరాజు, మాచర్ల చిన్నారావు, కపిల్ కుమార్ పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ : కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులర్పిస్తు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని శుక్రవారం వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు సుమారు 500 మంది వివిధ సామాజిక కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు, మాజీ ఆర్మీ సైనికులు నిర్వహించారు. అనంతరం పోచమ్మమైదాన్ సెంటర్‌లో అమరవీరులకు గుర్తుగా అమరదీపం వెలిగించారు. కార్గిల్ అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, కార్పొరేటర్ గందె కల్పన నవీన్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి యెర్రగొళ్ల శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమేశ్వర్మ, సాయికృష్ణ, సునీల్, రాజేష్, చింతల అనిల్ పాల్గొన్నారు.

జాతీయ పతాకాలతో ర్యాలీ

వరంగల్ చౌరస్తా : కార్గిల్ విజయం మన సైనికుల పోరాట ప్రతిభకు నిదర్శనమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమ్యాల శ్రీనివాసరావు అన్నారు. కార్గిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏవీవీ విద్యా సంస్థలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ప్రధాన రహదారిపై జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. 73రోజుల పాటు సాగిన యుద్ధంలో విజయాన్ని భారత ప్రభుత్వం కార్గిల్ విజయ్ దివస్‌గా ప్రకటించడంతో ఈ రోజు విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొం దించేలా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, కొడిమ్యాల శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.అనిత, విరేషలింగం తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



మాజీ సైనికులను సన్మానిస్తున్న గంట రవికుమార్



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

ఖానాపురం, జూలై 26: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగే విధంగా వైద్యాధికారులు కృషిచేయాలని మాత, శిశు సంరక్షణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆమె సందర్శించారు.రికార్డులను పరిశీలించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు జ్వరాలు, అతిసారం, డెంగీ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, దేవిక, జ్యోతి, రమ్య భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ జ్యోతి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దళితుల అభివృద్ధి

వర్ధన్నపేట, జూలై 26 : దేశంలో దళితుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అందుకు నిదర్శనమే ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడమేనని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.33,124 కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుల చిత్రపటాలున్న ఫ్లెక్సీకి శుక్రవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుభిక్ష సంక్షేమ పాలనే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకుసాగుతూ నియోజకవర్గంలో తనదైన ముద్ర వేస్తున్నారని వెంకటయ్య కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెపాక సమ్మయ్య, యాకర సాంబయ్య, మునిసిపల్ కౌన్సిలర్ తుమ్మల రవీందర్, ఐత ప్రవీణ్‌కుమార్, కొండేటి మధుకర్, కందిక ఎల్లస్వామి, చెరిపల్లి బాబు, కొండేటి బాలకృష్ణ, ఎర్ర శ్రీకాంత్, చీటూరి రాజు, యాకర యాదగిరి, హనుమకొండ సుధాకర్, నందిపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్ర బడ్జెట్‌లో నర్సంపేటకు అన్యాయం : బీజేపీ

నల్లబెల్లి, జూలై 26 : రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో నర్సంపేట నియోజకవర్గానికి తీరని అన్యాయమే జరిగిందని మండల బీజేపీ మండల అధ్యక్షుడు బొందిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఎంత ఇచ్చిందో మళ్లీ ఒకసారి కాంగ్రెస్ నాయకులు పరిశీలించుకోవాలని కోరారు. నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ రైతుల పక్షాన నిలబడి న్యాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తడుక వినయ్‌గౌడ్, కడియాల విజయ్, కొండ్లె రమేష్, ఊర్ల నాగరాజు, గుగులోతు తిరుపతి, భూక్య వైభ, సుమన్, రామ్‌ధన్, భరత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానిది ప్రజావ్యతిరేక బడ్జెట్ : ఆర్‌ఎస్‌పీ

వర్ధన్నపేట, జూలై 26 : కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేక బడ్జెట్ అని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పీ) జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ అన్నారు. వర్ధన్నపేట పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్పినా వాటిని లెక్క చేయకుండా ప్రజా వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే బడ్జెటే తప్ప ప్రజలకు ఉపయోగపడదన్నారు. రైతు కూలీలకు, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

• పర్వతగిరి: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేక బడ్జెట్ అని రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల నుంచి బీజేపీ గుణపాఠం నేర్చుకోకుండా ప్రజలకు కాకుండా కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడేలా ఉందన్నారు. బడ్జెట్ వల్ల దేశంలోని రైతులకు, కూలీలకు, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల శ్రీధర్, అర్షం యాకయ్య పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

వర్ధన్నపేట రూరల్, జూలై 26 : మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో చెట్టును కారు ఢీకొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఇల్లందలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో ఎవరికి ప్రాణపాయ పరిస్థితి లేకుండా పోవడంతో పాటు, ప్రమాదంలో గాయపడిన వివరాలు తెలియాల్సి ఉంది.

నెక్కొండ తపాలా కార్యాలయ భవనానికి వందేళ్లు

నెక్కొండ, జూలై 26 : నెక్కొండ మండల కేంద్రంలో తపాల కార్యాలయం ఏర్పాటు చేసిన భవనాన్ని నిర్మాణం చేసి వందేళ్లు అవుతుంది. 1924 సంవత్సరంలో బ్రిటిష్ అధికారులు ఈ భవన నిర్మాణంచేశారు. భవనంపై 1333 ఎఫ్ నెక్కొండ 1924 ఏడీ అని రాసివుంది. స్వాతంత్ర్యానంతరం బ్రిటిష్ అధికారుల విశ్రాంతి భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. నెక్కొండకు సమీపంలో పాకాల అటవీ ప్రాంతం ఉండడంతో బ్రిటిష్ అధికారులు నెక్కొండలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ తదితర పట్టణాల నుంచి నెక్కొండకు రైళ్లల్లో వచ్చి పాకల అడవికి వేటకు వెళ్లేవారు. బ్రిటిష్ అధికారు లు తిరిగి గమ్యస్థానంకు వెల్లడానికి మరో రైలు నెక్కొండ రైల్వే స్టేషన్‌కు రావడానికి పది రోజుల పడుతుండటంతో వారు విశ్రాంతి తీసుకొనుటకు నెక్కొండలో విశ్రాంతి భవనాలను నిర్మాణం చేయించారు. బ్రిటిష్ అధికారులు 1911లో నిర్మించిన ఒక భవనంలో ప్రభుత్వ అతిథి గృహాన్ని ఏర్పాటు చేశారు. 1924లో నిర్మించిన భవనంలో తపాల కార్యాలయం ఏర్పాటుచేశారు. తపాల కార్యాలయం ఏర్పాటు చేసిన భవనం లోపలి భాగాన్ని మూడు సంవత్సరాల క్రితం పోస్టల్ అధికారులు వారి సౌలభ్యానికి ఆధునికరించారు. తపాల కార్యాలయం ఏర్పాటు చేసి భవనం వందేళ్లు పూర్తవుతున్నా నేటికి చెక్కు చెదరకుండా వినియోగంలో ఉంది. బ్రిటిష్ అధికారులు నిర్మాణం చేసిన మరో రెండు భవనాల్లో ఒక భవనంలో సబ్ ఇన్‌స్పెక్టర్ నివాసాన్ని, మరో భవనంలో కస్టమ్స్ ఖాఖ ఏర్పాటు చేయగా, ఈ భవనాలను సరిగా వినియోగించని కారణంగా శిథిలావస్థకు చేరుకొని 20ఏండ్ల క్రితమే కూలిపోయాయి. వందేళ్లు దాటినా చెక్కుచెదరని తపాలా కార్యాలయం, ప్రభుత్వ విశ్రాంతి భవనాలను ఉద్దేశించి పూర్వీకులు ఆ కాలం కట్టడాలే వేరంటున్నారు.



1924లో నిర్మాణం చేసిన తపాల కార్యాలయ భవనం

ప్రభుత్వ భూమిలో నిర్మాణ అనుమతులు ఇవ్వొద్దు

నర్సంపేట టౌన్, జూలై 26 : నర్సంపేట పట్టణంలోని మహబూబాబాద్‌రోడ్‌లో గల ప్రభుత్వ సర్వే నెంబర్ 121లోని భూమిలో ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన నిర్మాణ అనుమతులను రద్దుచేయాలని కోరుతూ దళిత ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయ ఉద్యోగి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. దళిత సంఘాల నాయకులు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, తడుగుల విజయ్, అందె రవి మాట్లాడుతూ 121సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో గతంలో పనిచేసిన కలెక్టర్లు సర్వేచేయించి హద్దులు ఏర్పాటు చేయించారన్నారు. కొందరు వ్యక్తులు ఈ హద్దులను తొలగించి 129 సర్వే నెంబర్ భూమిగా చూపి మునిసిపాలిటీ నుంచి అనుమతులు పొంద డం శోచనీయమన్నారు.

ఇదే 121సర్వే నెంబర్ భూమిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి మాజీ ఎమ్మె ల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నిధులు మంజూరు చేయగా టెండ ర్ సైతం వేశారన్నారు. కొన్ని కారణాలవల్ల అంబేడ్కర్ భవన నిర్మాణం జరగలేదన్నారు. ఇప్పటి కైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 121 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంద ప్రకాశ్, నారాయణ, శ్రీకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

అంతరాలులేని సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యం

నెక్కొండ, జూలై 26 : అంతరాలులేని సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. నెక్కొండలోని వాసవి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో పేదలు. ధనికుల మధ్య తారతమ్యం పెరుగుతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నారంటూ ఆరోపించారు. దేశంలో భూర్జువా రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తూ దోపిడీలపై తిరుగుబాటు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధిపొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారతదేశంలో మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదన్నారు. కేంద్రంలో గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, తిరిగి మరోసారి వారి అండతోటే అధికారంలోకి వచ్చి వారి మేలుకోసమే పనిచేస్తుందని ఆయన విమర్శించారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య రాజ్యాంగ రక్షణ సాధ్యమన్నారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చేప్పినా ప్రధాన మంత్రి మోదీ వైఖరిల్లో ఏమాత్రం మార్పురాలేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, ప్రొఫెసర్ ఎం.శంకర్‌నారాయణ, మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మిషా, నాయకులు అక్కెలపల్లి రమేష్, రవి, గోవర్ధన్, యాకయ్య, పార్థసారధి, శరత్, పాలక కవిత, యాకోబ్, నరేష్, కృష్ణ, వెంకటలక్ష్మి, రజిత, శ్రీలత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

దుగ్గొండి, జూలై 26 : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం ఎంపీడీవో అరుంధతి సందర్శించి పరిశీలన చేశారు. విద్యార్థుల మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు సౌకర్యంపై హెచ్‌ఎం జ్యోతిలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలనచేశారు. పరిశుభ్రత పాటించాలని వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మూత్రశాలలను పరిశీలిస్తున్న ఎంపీడీవో అరుంధతి

గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్‌తో పాటు నీళ్లు..

చెన్నారావుపేట, జూలై 26 : గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్‌తో పాటు నీళ్లు వచ్చిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గుండ్లపెల్లి పావని నర్సంపేటలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ సిలిండర్‌ను తీసుకొంది. గ్యాస్ సిలిండర్ 2నెలల 8 రోజులకే ఖాళీ అయింది. మరో గ్యాస్ సిలిండర్‌ను తీసుకునే ముందు తనకు గతంలో ఇచ్చిన గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు వచ్చాయని ఏజెన్సీ వారికి ఫిర్యాదుచేయగా, వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. తనకు జరిగిన మోసంపై అధికారులు విచారణ చేసి, గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పావని కోరారు.



గ్యాస్ సిలిండర్‌లో వచ్చిన నీళ్ల దృశ్యం

విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు లేరు

చెన్నారావుపేట, జూలై 26 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులులేరని, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేరని డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అంగోతు భద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు ఉప్పరపల్లి, కోనాపురం, లింగాపురం, పాపయ్యపేట, జల్లి లతో పాటు పలు గ్రామాలు, తండాలు కలిపి 42 ప్రాథమిక పాఠశాలు ఉన్నాయన్నారు. పాఠశాలలో మొత్తం 185 మంది ఉపాధ్యాయులకుగాను 138మంది పని చేస్తున్నారన్నారు. మండలంలో 14 పాఠశాలలు విద్యార్థులు లేక మూత పడ్డాయన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కొంతమంది తాము అనుకున్న ప్రదేశానికి వెళ్లారన్నారు. మండలంలో పది మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు పది ఉన్నాయన్నారు. మొదటి యూనిట్ పరీక్షలు సమీపిస్తున్నా కొన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నరన్నారు. ఎంఈవో, ఎంఎస్‌వోల మధ్య సఖ్యత లేనపుడు పాఠశాలలో చదువులు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



అంగోతు భద్రయ్య

మల్టీజోన్-1 ఆయుష్ ఉద్యోగుల బదిలీ

(5వపేజీ తరువాయి)

ఎలు కుర్తి ఆయుర్వేద డిస్పెన్సరి ఫార్మసిస్ట్ బి.శంకర్, లక్ష్మీపూర్ ఆయుర్వేద డిస్పెన్సరి ఫార్మసిస్ట్ కె.రమేష్‌బాబు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఆయుర్వేద బోధన ఆస్పత్రి కార్యాలయం సూపరింటెండెంట్ బిల్లా కుమారస్వామి ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయానికి, ఇక్కడ పనిచేస్తున్న పులిరాజు వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రికి బదిలీ అయ్యారు. వీరిలో డాక్టర్ కె.వసంత, కార్యాలయ సూపరింటెండెంట్‌లు నూతన విధుల్లోచేరారు. మిగిలిన వైద్యులు, ఫార్మసిస్ట్‌లు శనివారం విధుల్లో చేరనున్నారు. బదిలీ ఉత్తర్వులు తీసుకునేందుకు ఆయుష్ వైద్యులు, ఫార్మసిస్ట్‌లు తరలిరావడంతో శుక్రవారం ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయం రద్దీగా మారింది. అయితే సీనియర్ మెడికల్ ఆఫీసర్లు, నాల్గవ తరగతి సిబ్బంది బదిలీ ఉత్తర్వులు శనివారం రానున్నట్లు తెలిసింది.

విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

నర్సంపేట టౌన్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ అన్నారు.విద్యకు అరకొర నిధులను కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నర్సంపేట పట్టణంలో శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 7.31 శాతం నిధులు కేటాయించడం శోచనీయమన్నారు. యూనివర్సిటీల్లో గ్రాంటును ప్రకటించి అన్ని రకాల వసతులను కల్పించాలని ఉద్యమిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.500 కోట్లు కేటాయించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఒక్క ఉస్మానియా యూనివర్సిటికి రూ. 500కోట్లు సరిపోయే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్ సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజిత్, సునీల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

పర్వతగిరి, జూలై 26: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పర్వతగిరి సర్కిల్ పరిధిలోని పర్వతగిరి, సంగెం, ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల్లో పాలు పంచుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నడుచుకోవాలన్నారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘాఉంటుందని, తరచూ సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు చేయాలన్నారు. బయటకు వెళ్తే సంబంధిత స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, సెటిల్‌మెంట్లు, భూ దందాలు, అనవసరమైన పంచాయితీల జోలికి వెళ్లకూడదని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని అన్నారు. సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్లు ఎలాంటి కేసులు కాకుండా ఉంటే రౌడీషీట్ తీసివేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి, సంగెం, ఐనవోలు ఎస్సైలు వెంకన్న, నరేష్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

వర్ధన్నపేట, జూలై 26 : ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని వర్ధన్నపేట సెకండ్ ఎస్సై ఎం.రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసంచేస్తున్నారని అన్నారు. సోషల్‌మీడియాలో స్నేహితులు, బంధువుల పేర్లపై బ్యాంకు ఖాతా తెరచి అత్యవసరంగా డబ్బు కావాలని, లక్షలు, కోట్ల విలువైన లాటరీ తగిలిందని ముందుగా కొంత డబ్బు చెల్లించాలని, తదితర మాయమాటలతో డబ్బు దండుకుంటున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటే బాధితులు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1930తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహి స్తున్న వెబ్‌సైట్లకు లేదా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తద్వారా పోగొట్టుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్ల ఖాతా నుంచి బదిలీ చేయకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బుచ్చిరాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీవాణి బాధ్యతల స్వీకరణ

చెన్నారావుపేట, జూలై 26 : చెన్నారావుపేట మండల ఎంపీడీవోగా శ్రీవాణి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అక్కడ పని చేసిన ఎంపీడీవో గోవిందరావు ఉద్యోగ విరమణ చేయగా, ఆయన స్థానంలో కరీంనగర్ జిల్లా శంకరపట్నం ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీవాణి ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల సూపరింటెండెంట్‌గా అయేషా పర్వీన్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న గడ్డం దయాకర్ నెక్కొండ మండలంలానికి బదిలీ కాగా, పర్వతగిరి మండలంలో పని చేస్తున్న అయేషా పర్వీన్ ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలను స్వీకరించారు.



ఎంపీడీవో శ్రీవాణి



సూపరింటెండెంట్ అయేషా పర్వీన్

అరుదైన చికిత్స

వర్ధన్నపేట, జూలై 26: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సచేసి కణతి తొలగించారు. మండలంలోని ఇల్లందకు చెందిన పాకనాటి అనసూయ తొడ భాగంలో పెద్ద కణతి ఏర్పడి నడవడం కష్టంగా మారింది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితంలేకపోవడంతో చివరగా వర్ధన్నపేటలో దివంగత డాక్టర్ రవీందర్‌రెడ్డి స్థాపించిన శ్రీవెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ వంగాల రాజ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యుల బృందం శస్త్రచికిత్స చేసి మూడు కిలోల కణతిని విజయవంతంగా తొలగించారు.



ఆపరేషన్ చేసిన వైద్యులు

బీఆర్‌ఎస్‌కు కృష్ణారెడ్డి రాజీనామా

చెన్నారావుపేట, జూలై 26 : బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్, మాజీ వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పదివీకి, బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



టీ షర్టుల అందజేత



టీషర్టులు వేసుకున్న విద్యార్థులు

నల్లబెల్లి, జూలై 26 : మండలంలోని మేడపల్లి ప్రభుత్వ ప్రైమరీ, హై స్కూల్‌లో 150 మంది విద్యార్థులకు శుక్రవారం జేడీ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ పింగిలి కవితారెడ్డి టీ షర్టులను అందజేశారు. అనంతరం జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేడీ లక్ష్మీనారాయణ హైదరాబాద్ నుంచి వీడియోకాల్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చదువే సమాజంలో ఆత్మగౌరవంగా బతికేందుకు ఉపయోగపడుతుందని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కీరియా, కుమారస్వామి, సోమ, వాలియా, మోహన్‌లాల్, సవిత, నర సింహ, కృష్ణమూర్తి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త మృతి

దుగ్గొండి, జూలై 26 : మండలంలోని తొగర్రాయిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బుస్సాని బుచ్చయ్య మృతి చెందగా నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ సందర్శించి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో ఆవుల నర్సింహారెడ్డి, రాజమల్లు, కాట్ల భద్రయ్య. పోశాలు, స్థానిక నాయకులు ఉన్నారు.

భార్యకు గుడి కట్టిన భర్త

ఖానాపురం, జూలై 26: ఏడాది క్రితం భార్య గుండెపోటుతో మృతిచెందగా.. ఆమె జ్ఞాపకాలను మర్చిపోలేకపోతున్న భర్త ఆమెకు గుడికట్టి, ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించి, నిత్యపూజలు చేస్తూ ఆమెపై తనకున్న ప్రేమను చాటుకుంటున్నారు.

మండలంలోని బుధరావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ఎనుగుతల వెంకటనారాయణ భార్య సుజాత (52) ఏడాది క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు గుర్తుగా పొలం వద్ద గుడి కట్టించి నిలువెత్తు విగ్రహాన్ని బుధవారం ఆమె వర్ధంతి సందర్భం గా ఆవిష్కరించారు.ఆమె జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ నిత్య పూజలు చేస్తున్నారు. ఆ దృశ్యాలు శుక్రవారం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. వెంకటనారాయణ దంపతులకు ఓ కుమారుడు ఉన్నారు.



భార్య విగ్రహానికి నమస్కరిస్తున్న వెంకటనారాయణ

మిషన్ భగీరథ పైపు లీక్



ఇల్లందలో మిషన్ భగీరథ పైపు లీకై వృథాగా పోతున్న నీరు

వర్ధన్నపేట రూరల్, జూలై 26 : మిషన్ భగీరథ పైపు లీకై నీరు వృథాగా పోతున్న సంఘటన మండలంలోని ఇల్లందలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇల్లంద గ్రామ శివారులోని ఆకేరు వాగు పాత రోడ్డు, చెక్ డ్యాం సమీపంలో ఉన్న మిషన్ భగీరథ పైపు లైను లీక్ కావడంతో నీరు ఎగిసి పడుతూ వృథాగా పోతుంది. నీరువృథాగా పోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వర్ధన్నపేట రూరల్, జూలై 26 : మండలంలోని ఉప్పరపెల్లిలో శుక్రవారం ఘనంగా కార్గిల్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మృతి చెందిన వీరజవాన్లకు హెచ్‌ఎం వేణు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1999లో జూలై 26న లడఖ్ జిల్లాలో కార్గిల్ హిమాలయ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో మరణించిన వీరజవాన్ల త్యాగం మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, విజయ, సాంబయ్య, రాజు, పద్మ, జావిద్, పీఈటీ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో బదిలీలు చేపట్టాలి

చెన్నారావుపేట, జూలై 26 : ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని పాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అమీనాబాద్‌లో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు అందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ పదకొండేళ్లుగా బదిలీలకు నోచుకోలేదన్నారు. గత సంవత్సరం బదిలీల నోటిఫికేషన్ వచ్చి, వెబ్ ఆప్షన్లు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీలు జరిగాయని, ఆదర్శ పాఠశాలలో బదిలీల ప్రక్రియ జరుగలేదన్నారు. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, శేఖర్, రాజుకుమార్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.